క్లుప్తంగా

రెండు జిల్లాల కేకేసీ ఇన్‌చార్జిగా బాబి

అమలాపురం టౌన్‌: కాకినాడ, అనకాపల్లి జిల్లాల కాంగ్రెస్‌ పార్టీ కేకేసీ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన పార్టీ పట్టణ అధ్యక్షుడు, కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి నియమితులయ్యారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు కేకేసీ ఇన్‌చార్జిలను జాతీయ కేకేసీ అధ్యక్షుడు ఉదిత్‌రాజు గురువారం నియమించారు. ఇందులో భాగంగా ఉదిత్‌రాజు నుంచి బాబి ఆ రెండు జిల్లాల ఇన్‌చార్జి నియామక పత్రాన్ని అందుకున్నారు. త్వరలోనే కాకినాడ, అనకాపల్లి జిల్లాలో తాను పర్యటించి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుధ్య పరిరక్షణపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న రవికుమార్‌

తాళ్లరేవు: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్‌ కోరారు. గురువారం ఆయన తాళ్లరేవు, పోలేకుర్రు పంచాయతీల్లో పర్యటించారు. అనంతరం ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న సురక్షిత తాగునీటిని పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం పారిశుధ్య చర్యలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్‌ఎస్‌ ప్రకాష్‌, సూరంపూడి వెంకటరమణ, ఉదయ్‌, సురేష్‌, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపుగా పెరిగిన కొత్త రకం వరి వంగడం



నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ ప్రశాంతి, సర్పంచ్‌లు

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట గ్రామంలో రైతు జక్కల మోహన్‌కుమార్‌ (చిన్నారి) సాగు చేసిన కొత్త రకం వరి వంగడం ఎంటీయూ 1,443 ఏపుగా పెరిగింది. గురువారం నారుమడిని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎ.ప్రశాంతి, సర్పంచ్‌ వెంటపల్లి నూకరాజు, రెడ్డి రెడ్డిబాబు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్‌ షాన్మోహన్‌ మినీ కిట్‌ ఇచ్చారని, దానిని సాగుచేయగా నారుమడి చాలా బాగా వచ్చిందన్నారు. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విధిగా పన్ను చెల్లించాలి

అమలాపురం టౌన్‌: విధిగా ఆదాయ పన్ను చెల్లిస్తే దేశ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని అమలాపురం ఐటీవో జనిపల్లి ఓం కృష్ణ సూచించారు. ఆదాయ పన్ను దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యానిధి స్కూలులో గురువారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఐటీవో ఓం కృష్ణతోపాటు, ఇతర ఐటీ ఆఫీసర్లు పన్నుల అభివృద్ధికి తోడ్పడే విషయాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయ పన్నుల చెల్లింపులపై విద్యార్థులకు క్విజ్‌ పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. విజేతలకు విద్యాబోధనకు ఉపయోగపడేలా బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం స్కూలు ఆవరణలో ఐటీవో మొక్కలు నాటారు. విద్యానిధి విద్యాసంస్థల చైర్మన్‌ ఏబీ నాయుడు, కరస్పాండెంట్‌ శ్యామల మహాలక్ష్మి, ప్రిన్సిపాల్‌ టి.నాగ మాధవితోపాటు పలువురు ఆదాయ పన్నుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పేదవైశ్య కుటుంబాలకు కిరాణా సామగ్రి అందజేత

అమలాపురం టౌన్‌: పట్టణ వాసవీ జాగృతి క్లబ్‌ అధ్యక్షుడు పసలపూడి సతీష్‌ ఆధ్వర్యంలో పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు గురువారం చేపట్టారు. స్థానిక ఎస్‌కే వృద్ధాశ్రమానికి రెండు సీలింగ్‌ ఫ్యాన్లు, సిమెంట్‌ బెంచీలు సమకూర్చారు. హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక శ్రీహరి మనోవికాస దివ్యాంగుల కేంద్రంలో మెడికల్‌ కిట్లు, క్లీనింగ్‌ సామాగ్రి సమకూర్చారు. పేదవైశ్య కుటుంబాలకు కిరాణా సామగ్రి పంపిణీ చేశారు. తన కుమారుడి జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

లంక తల్లమ్మకు ఆషాఢ సారె

ముమ్మిడివరం: గ్రామ ప్రజల ఇలవేల్పు లంక తల్లమ్మకి గురువారం ఆషాఢ సారెను గ్రామస్తులు సమర్పించారు. ముమ్మిడివరం పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి సారె, ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

- గోతులతో అధ్వానంగా మారిన రహదారులు
- అత్యవసర సర్వీసులు రాని పరిస్థితి
- కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం



చిర్రయానం వద్ద ఛిద్రమైన నీళ్లరేవు వెళ్లే రోడ్డు



బురదతో అధ్వానంగా మారిన కాట్రేనికోన-ముమ్మిడివరం రోడ్డు

కాట్రేనికోన: ప్రతి గ్రామానికి రోడ్లు వేసి అభివృద్ధి చేస్తామన్న కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టిన తరువాత రోడ్లను గాలికి వదిలేసిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా.. కనీసం గోతులు పడి అధ్వానంగా ఉన్న రోడ్లను సైతం అభివృద్ధి చేయకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో అభివృద్ధి చేసిన రోడ్లు తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదని బాహాటంగానే అంటున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని కాట్రేనికోన-ముమ్మిడివరం, కాట్రేనికోన-నీళ్లరేవు, జైభీమ్‌ నగర్‌ (మొక్కల తిప్ప) గెద్దనాపల్లి-పిల్లివానిగరువు, గెద్దనాపల్లి బక్కివారిపేట రహదారులు గోతులు ఏర్పడి దిగబడిపోయాయి. ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నరకం చూస్తున్నారు.

అత్యవసర సర్వీసులు రావడం లేదు..

మహిళలు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఆటోలపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లపై ఆటోల్లో ప్రయాణించడం వల్ల గర్భస్రావం అయిపోతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గచ్చకాయలపోర వంతెన నుంచి చిర్రయానం మీదుగా నీళ్లరేవు వెళ్లే రోడ్డు, అయినాపురం మీదుగా కాట్రేనికోన నుంచి ముమ్మిడివరం వెళ్లే రోడ్డు గోతులు పడటంతో అత్యవసర సర్వీసులు 108, 104 వంటి అంబులెన్సులు, ఆటోలు, బస్సులు సహితం రావడం లేదు. చిర్రయానం, నీళ్లరేవు ప్రజలు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆటోలు, బస్సుల్లో వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ముందు గ్రామాల్లో తిరుగుతూ తమకు ఓటు వేసి గెలిపించండి.. అధికారం చేపట్టిన తక్షణమే ఈ రెండు రహదారుల పనులు చేపడతామని చెప్పారు. కానీ, అధికారం చేపట్టిన తరువాత కనీసం కన్నెత్తి కూడా చూడట్లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు.

రోడ్డు వేయిస్తామని..

కాట్రేనికోన- ముమ్మిడివరం రోడ్డు పనులకు నిధులు మంజూరు అయ్యాయని, పనులు చేపడతామని చెప్పిన అధికారులు ఏడాది గడిచినా దాని గురించి ప్రస్తావనే లేదు. చిర్రయానం రోడ్డు పనులకు ఆగమేగాల మీద మండల పరిషత్‌ తీర్మానం చేయించి గమ్మున ఉండిపోయారని పలువురు అంటున్నారు. నీళ్లరేవు- కాట్రేనికోన రోడ్డు వెంబడి చిర్రయానం, గచ్చకాయలపోర, నాగపట్టణం, మర్రిచెట్టు కాలనీ, కాపులపాలెం, రాజానగరం, సత్తెమ్మ చెట్టు, రేవువారి పేట, వేట్లపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతి రోజూ కాట్రేనికోన, అమలాపురం వంటి పట్టణాలకు వెళ్లేందుకు ఎంతగానో దోహదపడుతుంది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.

రహదారి పనులు చేపట్టండి..



ముమ్మిడివరం-కాట్రేనికోన రోడ్డు గోతులు పడటంతో దిగబడి పోయింది. బైక్‌పై కాట్రేనికోన నుంచి ముమ్మిడివరం వెళ్లేందుకు వర్షాలతో బురదగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రజలకు అవసరమైన అత్యవసర సర్వీసులు ఈ రోడ్డులో రావడంలేదు. అధికారులు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

-కన్నీడి వెంకట రమణ, అడ్వకేట్‌, పల్లంకుర్రు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ అక్రమం



ఉంగరాల సంతోష్‌

తాళ్లరేవు: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌ రెడ్డి అరెస్ట్‌ అక్రమమని, ఆయన అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి ఉంగరాల సంతోష్‌ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసలు అవినీతికి ఆస్కారమే లేనటువంటి మద్యం వ్యవహారంలో స్కాం జరిగిందంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న గోబెల్స్‌ ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేవలం డైవర్షన్‌ రాజకీయాల కోసమే ఇటువంటి కేసులు పెడుతున్నారే తప్ప మరొకటి కాదని ఆయన పేర్కొన్నారు.

వైద్య వ్యర్థాలపై అధికారులకు ఫిర్యాదు



రోడ్డు పక్కనే పడేసిన బయోమెడికల్‌ వేస్ట్‌

యానాం: పట్టణ ప్రభుత్వాసుపత్రిలో బయోమెడికల్‌ వేస్ట్‌ను రహదారులపై పడేస్తుండటంతో గురువారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉపయోగించిన సిరంజ్‌లు, ఇంజెక్షన్‌ సీసాలు, దూది, గాజు క్లాత్‌ తదితర బయోమెడికల్‌ వేస్ట్‌ను నిబంధనల ప్రకారం బ్యాగుల్లో వాటిని నింపి ప్రత్యేకమైన డస్ట్‌బిన్‌లో భద్రపరిచి దూరప్రాంతాలకు సంబంధిత వాహనం తీసుకెళ్లాల్సి ఉంటుంది. వాటిని సేకరించకుండా రహదారి పక్కనే పడేస్తుండటంతో స్థానిక పారిశుధ్య సిబ్బంది తొలగిస్తున్నారు. ఇలాంటి వాటిపట్ల రోగాలు వ్యాప్తి చెందుతాయని, బయోమెడికల్‌ వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌ రూల్స్‌ను పాటించడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు స్థానిక సోషల్‌ యాక్టివిస్ట్‌ సలాది సత్యకృష్ణ, ఆదిమూలం శ్రీను తదితరులు తెలిపారు.

ఆర్థిక వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

అమలాపురం రూరల్‌: జాతీయ ఆదాయ పన్ను దినోత్సవ సందర్భంగా అమలాపురం మండలం సమనసలోని ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌లో గురువారం ఆర్థిక వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అమలాపురం ఐటీ అధికారి కృష్ణ మాట్లాడుతూ, దేశం అన్నీ రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఆర్థిక వ్యవస్థ మూలధారమన్నారు. అటువంటి ఆర్థిక వనరులు దేశానికి సమకూరాలంటే తొలుత ఆర్థిక వ్యవస్థపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక జ్ఞానం, దేశ ఆర్థిక వ్యవస్థ, ఆదాయ వనరులు వంటివి ప్రభుత్వం ఎలా ఉపయోగిస్తుందో విద్యార్థులకు వివరించారు. స్కూల్‌ డైరెక్టర్‌ నంద్యాల మను విహార్‌ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆర్థిక విషయాలపై అవగాహన పెరిగిందని, జాతీయ ఆదాయం, పద్ధతులు, ఆర్థిక ప్రగతి గురించి సమగ్రమైన దృష్టి పొందగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌ చైర్మన్‌ నంద్యాల నాయుడు, డైరెక్టర్‌ స్నేహప్రియ, ఆదాయ పన్ను అధికారులు పాల్గొన్నారు.

కాటన్‌ చిరస్మరణీయులు



కాటన్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

యానాం: గోదావరి జలాలు సముద్రంలో వృథాగా పోనీయకుండా ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి ఉభయగోదావరి జిల్లాలు సస్యశ్యామలం కావడానికి కారణమైన సర్థార్‌ కాటన్‌ చిరస్మరణీయులని ఆర్‌ఏఒ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం కాటన్‌ వర్ధంతిని పురస్కరించుకుని సమాచార శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఫెర్రీ రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ అదలరసన్‌, ట్రాఫిక్‌ ఎస్సై నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు కాటన్‌

అమలాపురం రూరల్‌: గోదావరి జలాలను పొలాలకు తరలించి గోదావరి డెల్టా ప్రాంత ప్రజల గుండెల్లో అపర భగీరథుడిగా నిలిచిన కాటన్‌ చిరస్మరణీయుడని అమలాపురం డిస్ట్రిబ్యూటర్‌ కమిటీ చైర్మన్‌ రాజులపూడి వెంకటేశ్వరరావు (భీముడు) అన్నారు. ఆర్థర్‌ కాటన్‌ వర్ధంతి సందర్భంగా అమలాపురం సబ్‌ డివిజన్‌ ఇరిగేషన్‌ కార్యాలయం వద్ద ఉన్న కాటన్‌ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితాన్ని గోదావరి జిల్లాలో నీటి పారుదల, కాలువల నిర్మాణ కోసం దారపోశారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాలువలు తీవ్రమైన కాలుష్యం ఎదుర్కొంటున్నాయని, ప్రజలు కాలువలు వద్ద చెత్త, చెదారం వేయడం మానుకోవాలన్నారు. అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్‌ శాఖ డీఈ కె.రామ జనార్ధనరావు, ఇరిగేషన్‌ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. నడిపూడి లాకుల వద్ద కాటన్‌ దొర వర్ధంతి సందర్భంగా సర్పంచ్‌ చెల్లుబోయిన వెంకటేశ్వరరావు, రైతులు నివాళిలర్పించారు. ఈ కార్యక్రమంలో రాయుడు బాల, మట్టపర్తి గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో విజయదుర్గ, గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా గురువారం సుమారు 100 కేజీల సారె సమర్పించారు. పురోహితులు పోచినపెద్ది శ్యామ్‌ శర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పూజలు నిర్వహించి సారె, పానకం, గాజులు, చీరలను అమ్మవారికి సమర్పించారు. తొలుత గ్రామంలోని మహిళలందరూ సారెతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత ప్రదర్శన



ఆర్టీసీ బస్టాండ్‌లో కళాజాత ప్రదర్శన

అమలాపురం రూరల్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వయోవృద్ధుల సంక్షేమ పథకాలపై పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. రామచంద్రపురానికి చెందిన ఎండీ బాబ్జి బుర్ర కథ బృందంతో కళాజాత కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. వయో వృద్ధులకు ప్రతినెల రూ.4 వేల పెన్షన్‌, ట్రిబ్యూనల్‌ ద్వారా ప్రతి నెల భరణం రూ.10వేలు అందించే చట్టాల గురించి ప్రజలకు కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. అనారోగ్యాల కారణంగా మనం ఏం కోల్పోతున్నామో వివరించారు. ఆసుపత్రిలో వృద్ధులకు ప్రత్యేక వార్డుల ఏర్పాటు గురించి అవగాహన కల్పించారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



గుర్రం జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

అమలాపురం టౌన్‌: తెలుగు సాహిత్య లోకంలో మహాకవి గుర్రం జాషువా అభ్యుదయవాదిగా ప్రజ్వరిల్లారని శ్రీశ్రీకళా వేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహామూర్తి అన్నారు. శ్రీశ్రీకళా వేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రవితేజ జూనియర్‌, డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన గుర్రం జాషువా వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ఆధునిక కవితా పుష్పవనంలో అభ్యుదయ భావాలతో అక్షర సమమం చేసిన సాహితీ వీరుడు గుర్రం జాషువా అని కొనియాడారు. కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ, జాషువ సామాజిక ప్రయోజనాలు ఆశించి ఎన్నో రచనలు చేశారని గుర్తు చేశారు. ఆయన రాసిన కావ్యాలు ఆంగ్ల, సంస్కృతం, ఫ్రెంచ్‌, జర్మనీ భాషల్లోకి అనువాదం అయ్యాయని చెప్పారు. తొలుత గుర్రం జాషువా చిత్రపటానికి కవులు, రచయితలు పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ కె.దొరబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై దాడి దారుణం

తాళ్లరేవు: అయినవిల్లి మండలానికి చెందిన దళిత యువకుడు దోనుపాటి మహేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. రాజ్యాంగం అమలులో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, అందువల్లే దళితులపై దాడులు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు స్వాహా చేసిన వారిని వదిలేసి మధ్యవర్తిగా ఉన్న మహేష్‌పై దాడి చేయడం దారుణమన్నారు. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ అనుచరులుగా చెప్పుకుంటూ ఉద్యోగాలు ఇప్పిస్తామని దందా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సుభాష్‌ ఈ దాడిపై స్పందించాలని ఆయన డిమాండ్‌ చేశారు. మహేష్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సిద్ధార్థ యూత్‌ సభ్యులు శ్రీనివాస్‌, వీరబాబు తదితరులు అన్నారు.

ఈడబ్ల్యూఎస్‌ అర్హుల కుటుంబాల సర్వే

యానాం: రీజియన్‌ పరిధిలో ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు అమలు చేస్తున్న ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌కు అర్హులను సమగ్ర సర్వే చేయడానికి పుదుచ్చేరి ప్రభుత్వం అంగీకరించిందని గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌ అమలులో కొందరు తప్పుడు మార్గాల్లో వెళ్లి దాని ఆశయాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. దీంతో యానాంలో పుట్టి పెరిగినవారు, ఇతర ప్రాంతాల నుంచి ఈ ఊరిని నమ్ముకొని వచ్చినవారు ఈడబ్ల్యూఎస్‌ సర్టిఫికెట్‌ పొందడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే నాలుగు సార్లు పుదుచ్చేరి ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చానన్నారు. ఈనెల 7న సీఎం రంగసామి, ఎల్జీ కె కై లాషనాథన్‌కు సమగ్రవివరాలను అందజేసానన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రూ.8లక్షల ఆదాయ పరిమితి, నిర్దేశిత కొలతల ప్రకారం ఇల్లు, భూములు ఉన్న వారికి మాత్రమే ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్‌ పొందాలన్నారు. 40 రోజుల్లోగా సర్వే చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సుల దారి మళ్లింపు

అమలాపురం రూరల్‌: జిల్లా కలెక్టర్‌, నేషనల్‌ హైవే అథారిటీస్‌ ఆదేశాల మేరకు చించినాడ బ్రిడ్జి మూసివేత కారణంగా శుక్రవారం నుంచి కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల బస్సులు దారి మళ్లిస్తున్నామని, మరో మార్గం చూసుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు సూచించారు. చించినాడ బ్రిడ్జి మీదుగా రాకపోకలు కొనసాగించే స్కూల్‌, కళాశాలల బస్సుల యాజమాన్యం, అదే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు మరో మార్గం ద్వారా రాకపోకలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని అందరూ గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

ఐ.పోలవరం: వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందింది. ముమ్మిడివరం, తాళ్లరేవు, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన 26 మందికి రూ.32.13 లక్షల చెక్కులను గురువారం ఎమ్మెల్యే బచ్చిరాజు అందజేశారు.

బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడి తండ్రికి చెక్కును అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.13 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంబాజీపేట మండలం వక్కలంక గ్రామానికి చెందిన పితాని ఆనంద నాగబాబుకి వెన్నెముకకు నరానికి మధ్యలో కణితి రావడం వలన నాలుగు సంవత్సరాలుగా లేవలేని పరిస్థితులో ఉన్నారు. తల్లి మృతి చెందడంతో తండ్రి ఒక్కరే నాగబాబు యోగక్షేమాలు చూసుకుంటున్నారు. అయితే తండ్రికి వృద్ధాప్యం కారణంగా ఏ పనికి వెళ్లలేని పరిస్థితి. ఆర్థిక సహాయం కోసం కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నాగబాబు తండ్రి పితాని వెంకటేశ్వర రావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేలు చెక్కును అందజేశారు.

ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ల విరాళం



కంప్యూటర్లు అందిస్తున్న దాత నారాయణప్ప

మలికిపురం: రామరాజులంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన రిటైర్డ్‌ ప్రావిడెంట్‌ ఫండ్‌ కమిషనర్‌ మేడిచర్ల నారాయణప్ప రూ.ఒక లక్ష విలువైన కంప్యూటర్లను విరాళంగా అందించారు. బుధవారం పాఠశాలలలో ఈ మేరకు అందించారు. ప్రధానోపాధ్యాయిని కాశిబట్ల వెంకట రామ సుబ్బలక్ష్మికి అందించారు. కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్‌ కమిటీ చైర్మన్‌ రావూరి రాజా రమేష్‌ పాల్గొని మాట్లాడుతూ దాతల ఔదార్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బేతినీడి శ్రీనివాస్‌, యేపుగంటి వెంకట పద్మనాభం, కూర్మా గణేష్‌ పాల్గొన్నారు.

శాకంబరిగా వైష్ణవి కనకదుర్గమ్మ



కనకదుర్గమ్మకు కూరగాయలతో అలంకరణ

అమలాపురం టౌన్‌: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉప ఆలయంగా ఉన్న వైష్ణవి కనకదుర్గ అమ్మవారు గురువారం శాకంబరిదేవి అలంకృతమై భక్తులకు దర్శనమిచ్చారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పువ్వులతో అమ్మవారిని అలంకరించారు. దాతలు వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు దూడల నాగ మణీంద్ర (ఫణి), వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్‌ వెంకట విరీతాదేవి దంపతులు అమ్మవారిని శాకంబరిదేవిగా అలంకరణ చేయించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఆషాఢం పూజలు జరిగాయి.

వైఎస్సార్‌ సీపీ నాయకుల పరామర్శ



సత్తిబాబు కుటుంబీకులను పరామర్శిస్తున్న నాయకులు

తాళ్లరేవు: స్థానిక పంచాయతీ 14వ వార్డు సభ్యుడు గీసాల సత్తిబాబు కుటుంబాన్ని గురువారం వైఎస్సార్‌ సీపీ నాయకులు పరామర్శించారు. సత్తిబాబు భార్య జానకి అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో తాళ్లరేవు జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌ సాగర్‌, నాయకులు బొంతు మోహన్‌, చిట్టూరి చలపతి, కొల్లు శ్రీనివాసరావు, పితాని కొండయ్య తదితరులు వారిని పరామర్శించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

యానాం: జోనల్‌ స్కూల్‌ గేమ్స్‌ 2025-26లో భాగంగా గురువారం స్థానిక డాక్టర్‌ వైఎస్సార్‌ ఇంటర్నేషనల్‌ ఇండోర్‌ స్టేడియంలో వివిధ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా అండర్‌-14,17 బాలికల విభాగాల్లో నిర్వహించిన బ్యాడ్మింటన్‌ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అండర్‌-14లో ప్రథమ స్థానం రీజెన్సీ పబ్లిక్‌ స్కూల్‌, ద్వితీయ స్థానం ఎస్‌కేఎస్‌ పీవీఆర్‌ఎన్‌ ప్రభుత్వ హైస్కూల్‌, తృతీయ స్థానం పీకేజీహెచ్‌ స్కూల్‌, గిరియాంపేట జట్టు కైవసం చేసుకున్నాయి. అండర్‌-17లో ప్రథమ స్థానం యానాం పబ్లిక్‌ స్కూల్‌, ద్వితీయ స్థానం ఎస్‌ఆర్‌సీఎస్‌ స్కూల్‌, తృతీయ స్థానం రీజెన్సీ పబ్లిక్‌ స్కూల్‌ జట్లు కైవసం చేసుకున్నాయి. అనంతరం బహుమతుల ప్రదానం నిర్వహించారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు ఐవీకే మోహన్‌, వడ్డి ప్రసాద్‌, వి.సన్యాసిరావు, కె.భాస్కర్‌, జె.చంద్రశేఖర్‌, బొట్టా శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాము కాటుకు వివాహిత మృతి



యనమదల ప్రవల్లిక (ఫైల్‌)

ముమ్మిడివరం: నగర పంచాయతీ శివారు రాజుపాలెం గ్రామానికి చెందిన యనమదల ప్రవల్లిక (27) పాము కాటుకు గురై మృతి చెందింది. గురువారం ఉదయం రాజుపాలెం గ్రామ ప్రధాన రహదారిపై వాకింగ్‌ చేస్తుండగా పాము కాటు వేసింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్సై డి.జ్వాలాసాగర్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఈఆర్‌ఓగా వెంకటేశ్వరరావు

యానాం: అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో పుదుచ్చేరి ఎన్నికల కమిషన్‌ ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్‌ రీజియన్‌ల్లో మొత్తం 30 నియోజకవర్గాల్లో అసిస్టెంట్‌ ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ ఆఫీసర్‌ (ఏఈఆర్‌ఓ)ల నియామకాల ఆదేశాలను జారీ చేసింది. యానాం నియోజకవర్గానికి స్థానిక సబ్‌ తాలూకా ఆఫీసులో డిప్యూటీ తహసీల్దార్‌ ఆర్‌.జ్యోతి వెంకటేశ్వరరావును నియమిస్తూ డిప్యూటీ డిస్ట్రిక్ట్‌ ఎలక్షన్‌ ఆఫీసర్‌ వినయ్‌రాజ్‌ ఆదేశాలు జారీ చేశారు.

ఏఎంవీఐగా అరుల్‌ జహగన్‌ నియామకం

యానాం: రీజినల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ ఆఫీసులో అసిస్టెంట్‌ మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా అరుల్‌ జహగన్‌ను నియమిస్తూ గురువారం పుదుచ్చేరి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్‌ కమిషనర్‌ ఎ.కుమరన్‌ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న కె.బాల సుబ్రహ్మణ్యంను రిలీవ్‌ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఏళ్ల తరబడి పర్మినెంట్‌ ఏఎంవీని నియమించకపోవడంతో స్థానిక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పుదుచ్చేరి నుంచి నెలకొకసారి వచ్చి మూడు రోజులు ఉండి ఏఎంవీలు వెళ్లిపోతుండటంతో స్థానికులు నెలల తరబడి వాహనాల రిజిస్ట్రేషన్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌ వంటివి నిలిచిపోయేవి. శాశ్వత ప్రతిపాదికన ఏఎంవీని నియమించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.